29/11/92

# పట్నం మాయరకోడకో...

సిన్నోడు కప్పుకున్న చిరుగుల గోనె ను కొద్దిగా తొలగించి బద్దకంగా కళ్ళు విప్పి చూశాడు. చూరుకి తగిలించిన లాంతరు అటూ ఇటూ ఊగుతూ— సిన్నోడు కుడిపక్కకు తిరిగి వొత్తిగిలి పడుకున్నాడు. పరుచుకున్న గోనెపట్టాకి చిరుగు ఉండడం వల్ల నేల చల్లగా తగిలింది. దాన్ని తిట్టుకుంటూ ఎడమ పక్కకి తిరిగాడు. సిన్నోడి చెల్లెలు ఎనిమిదేళ్ళ చంద్రి (వాడి భాషలో చెప్పాలంటే 'సెంద్రి') తల్లిని కావలించుకుని ఒక కాలు తల్లిమీద పడేసి ఆదమరచి నిద్రపోతోంది. ఆప్యాయంగా ఓమారు దాని మొహమంతా తడిమాడు.

నిన్నరాత్రి సగంలో ఆగిపోయిన ఆలోచనలు చుట్టుముట్టాయి. మళ్ళీ స్థిరంగా అనుకున్నాడు.

"ఈయాల్నుంచి నాను పట్నమెల్తాను" మనసులోనే అన్నాననుకున్నాడు కానీ, బయటికే అనేసాడా మాటల్ని.

అది వాడి తల్లి మాలచ్చి వింది.

"ఏట్రా సిన్నోడా! ఏటంతన్నవ్? నువ్వు పట్నమెల్తావా?"

"అవునే అమ్మా! నాను ఈయాల్నుంచి పట్నమెల్లి పనిక్కుదురుతాను."

మాలచ్చి గుండె గుబగుబలాడింది. ఇంకా పదేళ్ళయినా నిండుగా లేని సిన్నోడు పట్నంలో పంజాసుకుని కుటుంబాన్ని పోషిత్తానంటున్నాడు.

మొగుడు పోయిన దగ్గర నుంచీ తనే ఊర్లోని ఏదో ఒక పన్లోకెల్లి, కాసిన్ని గింజలు సంపాయిస్తోంది. ఏదో ఒకలా ఓ పూట పొయ్యిలో పిల్లిని లేపుతోంది. ఈమధ్య తనకేదో మాయదారి రోగం చేసి, నోటంట రగతం పడడంతో, ఆదేదో అంటురోగవన్జెప్పి, పన్లోకి రానీలేదెవళ్ళూను.

అప్పట్నుంచే సిన్నోడే నాలుగిళ్ళూ తిరిగి తన పేరు జెప్పి నాలుగ్గింజలు తెస్తే తను ఉడకేస్తోంది. పిల్లాణ్ణి సదివింపలేక మూడో తరగతి నుండే బడి మాన్పించింది.

"ఎందుకురా సిన్నోడా పట్నమెల్డం? ఈ వూళ్ళోనే ఏదో ఒక పనిక్కుదురు. మన రాయుడిగారికి గొడ్లు కాయను మడిసి కావాలంట. నిన్న గణపతన్న వొచ్చి చెప్పిండు. ఆ పనిక్కుదురు. లేదంటే కోతలికెళ్ళు."

"ఛస్. నీకు తెలీదూర్కోయే" కసురుకున్నాడు సిన్నోడు.

"నీకిదేం పోగాలంరా! ఏట్రా నాకు తెలీంది?" కోపంగా లేచి కూర్చుని జుట్టు ముడేసుకుంది.

ఇక్కడ పన్లో చేరితే మనకేం మిగల్దే. బొచ్చె మిగుల్తాది. ఏరోజు గింజలు ఆరోజు కొలుత్తారు. మరేం డబ్బులియ్యరు. మనం ఓ పూట తిని ఓ పూట కడుపులో మోగాళ్ళు పెట్టి తొంగోవాల్సి" కసిగా చెప్పాడు.

"పట్నంలో మాత్రం ఎక్కువిస్తారేంట్రా రెడ్డిగారిపొలంలో ధాన్యం కొలతలవుతున్నాయంట. ఆడికెల్లు. అంతేగానీ పట్నమెందుకు యెల్డం?"

మాలచ్చి ఆమాట అడిగిందో లేదో సిన్నోడికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

"అద్గదీ! అలాగడుగు సెప్తా! పట్నంలో నాబోటి పోరగాళ్లకి రోజుకూలీ ఎంతో తెలుసా?"

తల్లి ఎంత అని అడుగుతుందేమోనని ఎదురు చూసాడు కానీ అది అడక్కపోవడంతో తానే చెప్పాడు.

"పది రూపాయలిస్తారే పది రూపాయలు" ఆ సంఖ్య తల్లికీ తెలుసో తెలీదో అని తన పదివేళ్ళని క్లోజప్‌లోకి తెచ్చి తల్లి మొహం ముందు పెట్టి చెప్పాడు.

అప్పటికీ మాలచ్చికి ఎలాంటి ఉత్సాహం కలుగలేదు.

"నీకియన్నీ ఎవరు సెప్పార్రా?" అడిగింది గోనెపట్టాని చంద్రిమీద నిండుగా కప్పుతూ.

"మన రత్తం మావ కొడుకులేడే కిష్టిగాడు. ఆడు సెప్పాడు. ఆడు వారం రోజుల్నుంచీ ఎల్తుండట. అందుకే ఈయాల్నుంచి నాను కూడా ఎల్తానే. నాను పన్లోకెల్తే రోజుకి పది రూపాయలొస్తాయి గదా! అలా పదిరోజులు పన్లోకెల్తే వంద రూపాయలవుతాయి. అరవై రూపాయలెడితే మనకు నెలకెదురు నూకలొస్తాయి. ఇంకా మిగిలిన డబ్బులతో నీకు మందులు, సెల్లిదానికి గౌను కొంటాను. ఆ... సెల్లిదాన్ని అప్పుడు బళ్ళో ఎయ్యొచ్చు. దాన్నేనేటి! నెల్లో ఇంకా ఇరవై రోజులు నాను కూడా ఖాళీయే కదా! అప్పుడు నాను కూడా బళ్ళోకెళ్ళొచ్చు." తన మూడో తరగతి తెలివితేటలతో అప్పటికప్పుడు లెక్కలుకట్టి కమ్మని కలలాంటి భవిష్యత్తునూహించి చెప్పుకుపోతున్నాడు సిన్నోడు.

లాంతర్‌లో కిరోసిన్ తగ్గింది. లాంతర్ కాంతి విహీనవవుతుండగా దాన్ని ఊదేసింది మాలచ్చి. ఒక్కసారి గుడిసెంతా చీకటి అలుముకోవడంతో తలుపుగా ఉద్దేసింపబడిన గోనెపట్టా తాడు ముడి విప్పి దాన్ని పైకెత్తి చూరునున్న మేకుకి తగిలించింది.

అప్పుడే పొద్దు పొడుస్తోంది.

"మాలచ్చత్తా! సిన్నోడింకా లెగిసాడా లేదా?"

కిష్టిగాడి గొంతు వింటూనే ఒక్క ఒళ్ళు విరుపుతో బద్దకాన్ని పారద్రోలి, ఉత్సాహంగా బయటికొచ్చాడు సిన్నోడు.

విరిగిన గోలెంలోని చన్నీళ్లతో గబగబా మొహం కడుక్కుని నోరు పుక్కిలించి ఇంట్లోకి వచ్చి, తల్లి చీర కొంగుతో మొహం తుడుచుకున్నాడు.

మట్టికుండలోని నీళ్ళు సత్తుగ్లాసుతో తాగి చెప్పాడు.

"నానెల్తానే అమ్మా!" తనకిష్టమైన పెద్ద పువ్వుల చొక్కా వేసుకున్నాడు.

"నాకైతే ఏటోగా ఉందిరా సిన్నోడా! ఉన్న ఊరునొగ్గి ఆ పట్నమెందుకురా! గంజో నీల్లో ఆ పైవోడు ఏదిస్తే అది తాగుదాంరా!"

"ఛస్. ఊర్కో. నీకు తెల్దే. సాయంత్రానికల్లా ఎన్ని డబ్బులొట్టుకొస్తానో సూడు. సెల్లిది లేచి నాకోసం ఏడుస్తదో ఏటో, నేను సాయంత్రానికల్లా తిరిగొచ్చేస్తానని చెప్పు."

ఇంకా అప్పగింతలేం మరిచిపోయానోనని పునరాలోచించుకుని ఇంకేమీ లేవని నిర్ధారించుకున్నాక చెప్పాడు.

"మరి నేనెళ్ళొస్త. అట్ట సీదరగా సూడమాకే అమ్మా!"

"మంచిదిరా. ఎల్లు" అయిష్టంగానే చెప్పింది మాలచ్చి.

సిన్నోడు వెళ్ళిపోయాక గుర్తొచ్చింది మాలచ్చికి. వాడు వొట్టి కడుపుతోనే వెళ్ళాడని. పెడదామన్నా ఇంట్లో ఏమీ లేదని.

గంటన్నర సేపు నడచి పట్నం చేరుకున్నారు పల్లె నుంచి బయలుదేరిన కూలీల



బృందం. పట్నం చేర్తూనే పెద్ద బజార్లో ఉండే భూషణం దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆ బృందానికి నాయకుడనదగిన పైడయ్య.

"ఏరా పైడయ్యా! ఈయాల కొత్త మొకాలెవ్వరా!" అడిగాడు భూషణం లంక పొగాకు చుట్ట కొసను నోటితో కొరికి తుపుక్కున ఉమ్ముతూ.

"ఇదిగో ఈ సిన్నోడు భూషణం గోరూ!" అంటూ వెనకమున్న సిన్నోడి భుజాన్ని పట్టుకుని ముందుకు తోసాడు.

"నీయవ్వ. ఈ బటానీగాళ్లని తీసుకురావొద్దని ఎన్నిసార్లు సెప్పాల్రా! గట్టిగా ఒక గమేళా ఇసుక మొయ్యలేరు. కనీసం పోసెయ్యమంటే, ఒక గునపం కూడా ఎత్తలేరు. పనెగయ్యడానికి ఏ మూలో నక్కి మరి కంటికి కనపడరు. ఆదీగాక గవురమెంటు పనులకు పంపితే, ఆ లేబరిన్స్పెక్టరొచ్చి పద్నాలుగేల్లు నిండనోల్లని కేసు బుక్ చేస్తాడు.

"ఈసారికి కానీ దొరా? పాపం కష్టాల్లో ఉన్నాడు. ఈడి బాబు తాగి తాగి సచ్చీడు. ఈడి తల్లికి టి.బి. రోగం. ఈడి కుటుంబం ఈడినే నమ్ముకుంది. ఈడి కుటుంబానికి రెండు పూటలా మెతుకు దొరికితే మనకు పుణ్యమొస్తది."

మనిషి అవసరానికీ, అద్వైత సిద్ధికి ఉన్న సంబంధాన్ని తేల్చి చెప్పాడు పైడయ్య.

తనని ఈసడించిన భూషణం మీద పీకల్దాకా కోపం వచ్చింది సిన్నోడికి. కానీ సిరంతరం సారా తాగి ఎర్రబడిన భూషణం కళ్లని చూసి భయం కూడా వేసింది.

"సర్లె సర్లె. కంటోన్మెంటులో బంగారాజుగారి షాపింగ్ కాంప్లెక్స్ కడుతుండారు కదా! ఆడికి తోలుకుపో ఈల్లిందరినీ. నిన్ననే ఫోన్ కొట్టాను బంగ్గారాజుగారికి, నేను మాత్రం 'సైటు'కొచ్చి కలుత్తాలే."

వచ్చినట్టు కూలీలంతా పెద్ద బజారు నుంచీ మైలు దూరమున్న కంటోన్మెంటుకి కాళ్ళీడ్చుకుని బయల్దేరారు కూలీలందరూ.

సిన్నోడికి పట్నంలో కూలి మొదటిరోజు అనుభవం ఉత్సాహంగా ఉండొచ్చు. కానీ ఆకలికి మొదటిరోజు కాదుకదా! ఒట్టి నీళ్ళు తప్ప కడుపులో ఏమీ పడలేదేమో అడుగు తీసి అడుగువేస్తుంటే కడుపు నెప్పిపుడుతోంది.

బంగారాజుగారి కాంప్లెక్స్‌కి చేర్తూనే పైడయ్య అందరికీ ఎవరెవరు ఏయే పనులు చెయ్యాలో పురమాయించాడు. సి

29/11/96



# సోమయాజుల సోదరులు

న్నోడికి కొత్త కాబట్టి పెద్దగా అనుభవం లేని పని అప్పగించాడు. పెద్దగా అనుభవం అక్కరలేని కాంక్రీటు మిక్చర్ కి నీళ్ళు పోయడమే సిన్నోడి పని.

పన్లోకి దిగేముందే అందరికీ టీలు సప్లై చెయ్యబడ్డాయి. సిన్నోడికి ఆ అనుభవం కించిత్ గర్వంగా ఉంది. తన వయసు ఉన్న టీకొట్టు కుర్రాడు టీ అందిస్తే తాగడం! వాడు పుట్టాక అంతటి గౌరవం అందుకోడం అదే మొదటిసారి.

కూలీలు గుంపులు గుంపులుగా కూర్చుని టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. టీ తాగి ఒక నిమిషమైనా కాలేదు. ఆరడుగులకి అటూ ఇటుగా ఉన్న ఒక వ్యక్తొచ్చి "ఇంక కబుర్లు కట్టిపెట్టి పన్లోకి దిగండ్రా!" అని బొంగురు గొంతుతో అరచివెళ్ళాడు. అతడు సూపర్వైజరనీ, అతడినే అందరూ పెద్ద మేస్త్రీ అంటారని కిష్టిగాడు సిన్నోడితో గుసగుసగా చెప్పాడు.

సరిగ్గా తొమ్మిది గంటలకి అంతా పన్లోకి దిగారు.

ముందు చెప్పినట్టుగానే— సిన్నోడి పని నీళ్ళు మొయ్యడం. కాంక్రీట్ మిక్చర్ కి దాదాపుగా వందడుగుల దూరంలో బోరింగ్ ఉంది. అక్కణ్ణుంచి సిన్నోడితో పాటు మరొకిద్దరు ఆడపిల్లలు, సిన్నోడి వయసే ఉన్న ఇద్దరు మగపిల్లలు నీళ్ళు మోస్తున్నారు.

మొదట రెండు బిందెలకి ఏమీ అనిపించలేదు సిన్నోడికి. కానీ మూడో బిందెకి సిన్నోడి గూళ్ళు చేరినంత పనయ్యింది. కాస్సేపు అలుపు తీర్చుకోవడానికి రాయి మీద కూలబడ్డాడు.

ఇంతలో ఎక్కణ్ణుంచి వచ్చాడో పెద్ద మేస్త్రీ సుడిగాలిలా వచ్చి "ఏరా గుంట నాకొడకా! ఆళ్ళంతా మోత్తుంటే రాజాలా కూర్చున్నావేం? పన్జెయ్యడానికి ఇష్టం లేకపోతే బయటికి నడు. బంగార్రాజు గారు గానీ సూసారంటే నీలాటోళ్ళని— నాకు మాటొస్తది" అని సిన్నోడిజుట్టు పట్టుకుని బోరింగ్ వైపు తోసాడు.

"అబోతు నా కొడుకు" కసిగా తిట్టుకున్నాడు సిన్నోడు కన్నీళ్ళని బలవంతంగా ఆపుకుంటూ.

భోజనాల వేళకల్లా సిన్నోడి కళ్ళముందు చీకట్లు.కమ్మాయి. ఇంటినుండి సద్ది తెచ్చుకున్న వాళ్ళు అది విప్పుకుని తినడం ప్రారంభించారు. ఏమీ తెచ్చుకోని వాళ్లకి దగ్గర్లోని రాజుల మిలటరీ హోటల్ నుండి మీల్స్ పొట్లాలు వచ్చాయి.

పులుసన్నంలో కారం ఎక్కువ కావడంతో ఎక్కిళ్ళ మధ్య అన్నం తినలేక మంచి నీళ్లతోనే నోటి మంటను చల్లార్చుకున్నాడు సిన్నోడు. దానితో అన్నం పూర్తిగా తినకుండానే కడుపు నిండిపోయింది. మిగిలిన అన్నం దాచుకుంటూ అనుకున్నాడు. అంతలోనే 'సీ ఈ పాసన్నం ఎందుకాళ్లకి. రేతిరికి ఏడిగా అన్నం, సేపలకూర తినొచ్చు.' అని సరిపెట్టుకుని అన్నం పొట్లాన్ని దూరంగా విసిరేసాడు.

కాస్సేపు విశ్రాంతయ్యాక మళ్ళీ పని ప్రారంభమయింది. గంటలు గడుస్తున్న కొద్దీ సిన్నోడిలో ఉత్సాహం పెరుగుతోంది. పనిపట్ల ఉత్సాహం కంటే ఇక కొద్ది గంటల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చన్న ఉత్సాహం అది. ఇంకాసేపట్లో డబ్బులు చేతిలో పడతాయన్న ఆలోచన వల్ల కలిగిన ఉత్సాహం అది.

మెల్లిగా ఒక్క క్షణం తీరిక చేసుకుని నిచ్చెన పైకెక్కి చిన్న మేస్త్రీకి గమేళాతో ఇటుకలందిస్తున్న కిష్టిగాణ్ణే అడిగాడు.

"ఇంకెంత సేపు సేయ్యాలావని?"

సాయంత్రం ఐదు గంటల వరకు అవుతుందిరా పని. ఆ తర్వాత డబ్బులు తీసుకుని యెలిపోడమే." చెప్పాడు కిష్టిగాడు.

"ఇక ఆ ఉత్సాహంలో సిన్నోడికి పని పెద్ద కష్టమనిపించలేదు. అప్పటికెన్ని బిందెల నీళ్ళు మోసాడో లెక్కలేదు. కాంక్రీట్ కి నీళ్ల మొయ్యడం అయిపోగానే, ప్లాస్టరింగ్ కి ఇటుక, సిమెంట్ కలిపేందుకు కూడా నీళ్ళు మొయ్యమన్నారు. ఆ పని కూడా చేశాడు.

నాలుగున్నర నుండీ ఒక్కొక్కరూ కాళ్ళూ చేతులు కడుక్కుని పని కట్టెయ్యడం ప్రారంభించారు.

పావుతక్కువ అయిదుకల్లా అందరూ పని కట్టేసి గుమస్తా ముందు వరసలో నిలబడ్డారు. గుమస్తా ఒక్కొక్కరికీ డబ్బులిస్తూ చిట్టాలో వేలిముద్రలు వేయించుకున్నాడు. సిన్నోడి పేరు చిట్టాలో 'గోపాల్'గా రాయబడింది. తన పేరు చూసుకున్న సిన్నోడు మురిసిపోయాడు.

తన ముందు నిల్చున్న సిన్నోణ్ణి— తలను కొంచెం ఎత్తి కళ్ళద్దాల పైనుంచి చూశాడు గుమస్తా.

"కొత్తగా చేరావా?"

"అవ్"

"సరే ఇంద" ఒక అయిదు రూపాయల నోటు చేతిలో పెట్టాడు. సిన్నోడు ప్రశ్నార్థకంగా గుమస్తాకేసి చూశాడు.

"ఏంట్రా! ఏంటా చూపు?"

"అదీ... అదీ... కూలి పది రూపాయలు కాదా?"

ఆహా! పెద్ద మొగాడు బయల్దేరాడండీ అడగడానికి. ఏం! నిన్ను జేర్చినాడు అవన్నీ చెప్పలేదా నీకు. యెల్లి ఆడ్నడుగు. పక్కకి తప్పుకో" చేత్తో పక్కకి తోసాడు సిన్నోడ్ని.

పక్కకొచ్చాక కిష్టిగాణ్ణే అడిగాడు.

"అవున్రా! కూలి పది రూపాయలు రాసుకుని ఎనిమిదే ఇస్తారు. మరి నీకు ఆళ్ళు రెండు టీలు తాపించారు గదా! భోయినం కూడా పెట్టించారు గదా! వాటికి మూడ్రూపాయలు కోత. పోతే నీకు ఐదు రూపాయలే కదా వొస్తది.

ఆ లెక్క వినగానే సిన్నోడి తల తిరిగిపోయింది. "అద్రేటా! ఇంత సాకిరీ చేయించుకున్నోళ్ళు ఆమాత్రం టీ నీళ్ళు కూడా ఆళ్ళ డబ్బుల్తో పొయ్యరా! పోనీ భోయినం మన డబ్బులు తీసుకున్నారంటే బానే ఉంది!"

"ఎందుకు పోస్నారా! ఆళ్ళకేం పట్టిందీ!" తలలో పడిన ఇసుకని దులుపుకుంటూ అన్నాడు కిష్టి.

తన సంపాదనలో సగం జారిపోవడంతో సిన్నోడు కట్టుకున్న ఊహల సౌధాల్లో సగం అప్పుడే కూలిపోయాయి.

"ఇంక మనమెళ్ళొచ్చా?"

"ఉండు. భూషణం రావాల గదా?"

"ఓహో! ఆడితో సెప్పాలా మనం ఎలిపోయే ముందు?"

"సెప్పడం కాదహె. ఆడి కలచ్చనుంటదిప్పుడు."

భూషణం కలెక్షనంటే ఏంటో అర్థం కాలేదు సిన్నోడికి. ఏమైనా భూషణం వొచ్చేలోపే వెళ్ళిపోవాలనుకున్నాడు సిన్నోడు. మెల్లిగా గేటు ఆవరణ దాటుతుండగా మహిషం మీద యముడిలా భూషణం మోటార్ సైకిల్ మీద వస్తున్నాడు. వస్తూనే దిక్కులు చూస్తూ చల్లగా జారుకోబోతున్న సిన్నోడి వాలకం కనిపెట్టేశాడు.

బండి ఆపి స్టాండు వేసి సిన్నోడి పెడరెక్కలు విరిచి పట్టుకుని అడిగాడు.

"ఎక్కడికిరా.....వ్?" చివర్న బూతు మాట ఉపయోగించాడు.

"ఇంటికి."

"నేను రాకుండా ఎల్లకూడదని తెలీదా?"

"తెలీదు."

"సర్లే. నా ఖాతా అక్కడెవరికైనా ఇచ్చావా?"

"నీ ఖాతా అంటే?" అంత భయంలోనూ గొంతు పెగిలించుకున్నాడు సిన్నోడు.

"ఒరేయ్ పైడయ్యా! గుంటడికి ఇక్కడి పద్ధతులన్నీ చెప్పలేదేట్రా! నన్నే కొశ్చనింగ్ చేస్తున్నాడీడు. "అంటూ సిన్నోడి చొక్కా జేబులోంచి ఐదు రూపాయలు తీసి తన జేబులో వేసుకుని చెప్పాడు.

"కూలీ చూపినందుకు నెల్లాళ్ళ వరకూ ప్రతీరోజూ నాకు మూడు రూపాయల్విడం ఇక్కడున్న అందరికీ ఆనవాయితీరా బేటా! నేనేగానీ కూలీ చూపకపోతే, నీ అంతట నువ్వే పని ఎతుక్కుంటూ ఎల్తే ఎవరూ పని ఇవ్వరు సరిగదా! దొంగనాకొడుకువనుకుని తరిమికొడతారు తెల్సిందా?"

సిన్నోడికి సిర్రెత్తుకొచ్చింది. పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా కష్టపడితే మిగిలింది ఖాళీ జేబు. ఆకలి కడుపు.

ఉక్రోషంగా అరిచాడు.

"తెల్సిందిరా! తెల్సింది. మీరందరూ మా కష్టం మీద బతికే యెదవనాయాల్లు. మేం మీ కడుపు నింపడానికి పుట్టిన అలగా జనాలం. మీరంతా దొంగ నాకొడుకులు."

ఆ మాటలు అంటూనే ఎవరికీ అందనంత వేగంగా రోడ్డుమీదకి పరుగెత్తి పల్లె దిక్కుగా పరుగుతీసాడు.

* * *

రాత్రి సిన్నోడికి ఒంటికి కావడం పెడ్తూ అంది మాలచ్చి.

"నా మాట విన్నావు కాదురా సిన్నోడా! పట్నం మాయరా అని సిలక్కి సెప్పినట్టు సెప్పాను కదురా!"

కలత నిద్రలోనే కలవరిస్తున్నాడు సిన్నోడు.

"నానిక పట్నమెల్లనే అమ్మా! నానిక పట్నమెల్లను..."